


# పరదేశీ కథలు
## - చిట్టే సిద్ధ లలిత



- 114 -

## ముగింపు

**కి(రుమంటూ తెరుచుకుంది** రేకు తలుపు. తలెత్తి చూసింది భాగ్య. వంకర నవ్వుతో చేతి కట్లు విప్పి రొట్టె ముక్కలున్న ప్లేటును అందించాడు గాజీ.

ఆకలిమీద వుందేమో ఆవురావురుమంటూ రెండు నిముషాల్లో తినేసింది భాగ్య. "ఇంకా కావాలా" అడిగాడు కళ్ళెగరేస్తూ..

"ఆ.." అంటూ తలూపింది.

"ఇంకొక రొట్టె ఇస్తా. గొడవ చెయ్యకుండా చెప్పిన మాట వింటావు కదా" నవ్వాడు.

మౌనంగా తల వంచుకుంది. బొటబొటా కన్నీళ్ళు రాలాయి.

బుగ్గలపైకి జారిన కన్నీటిని తుడుచుకోవడానికి చేతులు పైకి ఎత్తి "అమ్మా" అంటూ బాధగా అరిచింది.

"చూసావా.. మాట వినకపోతే ఎన్ని బాధలో! ఐదేళ్ళుగా నీలో మార్పు రాలేదు. అందుకే ప్రతిరోజూ బలవంతంగా నిన్ను రేప్ చెయ్యాల్సివస్తోంది. అదే నువ్వు బుద్ధిగా మాట విన్నావనుకో ఎంత సుఖం.."

బూటు కాలితో గడ్డాన్ని పైకి ఎత్తుతూ చెప్పాడు. కోపంగా చూసింది. ఆ చూపులకే శక్తి వుంటే వాడు అక్కడే భస్మం అయ్యేవాడు.

పెదవి విరిచాడు.

"నీ ఖర్మ. నీకు ఇండియాకు వెళ్ళి నీ పిల్లల ముఖం చూసే రాత లేదు. ఏదో ఒకరోజు ఇక్కడే కువైట్ లోనే చస్తావు నువ్వు. శవాన్ని తీసుకెళ్ళి ఎడారిలో పూడ్చిపెట్టేస్తా" ఆవేశంగా చెప్పాడు.

నోరు విప్పలేదు భాగ్య.

"నీ ఇష్టం.. నువ్వు నా చిమ్నీగా మారకపోతే బతుకంతా నీకు ఈ శిక్ష తప్పదు. సరే కానీ" అంటూ మృగంలా మీద పడ్డాడు.

గట్టిగా కళ్ళు మూసుకుంది భాగ్య. కన్నీళ్ళు కొనుకుల్లోనుండి ప్రవహించాయి. ఆమె కాళ్ళకు, చేతులకు సంకెళ్ళు వేయబడి వున్నాయి. కదలలేని పరిస్థితి. కాదనలేని దుస్థితి.

ఐదేళ్ళుగా ఆమె వెలుగును చూడలేదు. వేరే మనిషితో మాట్లాడలేదు. కువైట్ లో ఆ శాడిస్ట్ చేతిలో బందీగా మారి చిత్ర హింసలు అనుభవిస్తోంది. ఆ చీకటి గదిలోనే మగ్గిపోతోంది.  ఆమె ఆరోగ్యం దిగజారిపోయింది. ఇలాగే వుంటే, ఈ హింస కొనసాగితే బహుశా ఇంకొన్ని నెలలు మాత్రమే ఆమె బతుకుతుందేమో. ఏదో ఒక విధంగా ఆ దేవుడే కాపాడాలి ఆమెను.

ఐదేళ్ళనుండీ నిరవధికంగా సాగుతోంది ఆ దారుణకాండ. అతడు మస్రీ. అంటే ఈజిప్షియన్. ఐదేళ్ళ క్రితం ఒకరోజు భాగ్య పాత సూక్ లో బెంచీపై కూర్చుని కనిపించింది. బెంచీకి ఎదురుగా వున్న అత్తరు షాపు గాజీది. షాపులోనుండి ఆమెను గమనిస్తున్నాడు అతను. ఆ పక్కనే పార్కులో వున్న ట్యాంకు నీళ్ళు తాగుతూ ఆ రోజంతా అక్కడే ఆమె గడిపింది.

ఆమె వాలకం చూసి, బెదిరే చూపులను గమనించి, ఒంటరిదని, ఏదో ఆపదలో వుందని భావించి సాయంత్రం పూట దగ్గరికెళ్ళి "సులోనెచ్" అంటూ పలకరించాడు.

దిక్కుతోచని స్థితిలో వుందేమో అతని మాటకు కన్నీళ్ళొచ్చాయి.

చెప్పకపోయినా ఆమె పరిస్థితి అర్థమయింది. వెంటనే షాపులోకి తీసుకెళ్ళాడు. బ్రెడ్ కు జాం రాసి ఇచ్చాడు. వేడి వేడి చాయ్ తాగించాడు. కాస్త తెప్పరిల్లింది. కృతజ్ఞతగా చూసింది.

వచ్చీరాని అరబ్బీలో  ఏజెంటు మోసం చేసాడని కువైట్ ఇంట్లో పనికి పెట్టకుండా వేధిస్తున్నాడని అందుకే పాస్ పోర్టు తీసుకుని పారిపోయి వచ్చానని చెప్పింది.

జాలిగా చూసాడు గాజీ. చాలామంది మగాళ్ళు మృగాలేనని తెలియక గొర్రెలా గాజీని  నమ్మింది భాగ్య.

గాజీ కువైట్ పట్టణంలోని ఆ పాత సూక్ లో పదేళ్ళుగా అత్తరు షాపును నడుపుతున్నాడు. ఆ షాపులో అన్నిరకాల అత్తరులు వున్నాయి. ఈజిప్ట్ నుండి తెప్పించానని పగలు వాడే అత్తరు, రాత్రిళ్ళు వాడే అత్తరు, యువకులు వాడేవి, ముసలివాళ్ళు వాడేవి, శృంగారాన్ని పెంచేవి, మత్తులో ముంచేవి, మాయచేసేవి వున్నాయని చెప్పి అరబ్ సేట్లను ఆకర్షిస్తూ అత్తరు అమ్ముతుంటాడు. భార్య నలుగురు పిల్లలు ఇక్కడే వున్నారు.

వయసులో వున్న భాగ్యను చూసి ఆమె ఒంటరిదని, ఏ దిక్కూలేనిదని గ్రహించి ఎగిరి గంతేసాడు వాడు. రొట్టె విరిగి నేతిలో పడిందనుకున్నాడు.

షాపు కింద నేలమాళిగలో సామాన్లు వేసే చిన్నగదిలో ఆమెను వుంచాడు. అక్కామా లేదు కాబట్టి పోలీసులు చూస్తే ప్రమాదం ఆమెను పట్టుకుని పోయి జైల్లో పెడతారని భయపెట్టాడు. ఇలాంటి మాయమాటలు చెప్పి ఎంతమంది అమ్మాయిలను పాడుచేసాడో ఆ దుర్మార్గుడు.

ఎదురు తిరిగిన వారిని ఎన్ని విధాలుగా హింసించాడో, ఎన్ని దురాగతాలకు పాల్పడ్డాడో ఆ నేలమాళిగలోని ఆ గదే సాక్షి. అమ్మాయిలతో ఆట ఒక వినోదం వాడికి.

కానీ అన్ని కథలకూ ఎక్కడో ఒక చోట ముగింపు వుంటుంది. వుండాలి కూడా. అది ఐదేళ్ళ తర్వాత భాగ్యతో సాధ్యమయింది

తరువాత ఆమె ఇక్కడ వున్నట్లు తన భార్యకు కూడా తెలియకూడదని, తెలిస్తే అపార్థం చేసుకుని గొడవ చేస్తుందని చెప్పి గది దాటి బయటికి రావద్దనేవాడు.

"సరే. ఎక్కడైనా పని చూడండి. బ్రతుకుతాను" అని అర్థించింది భాగ్య.

తప్పకుండా సహాయం చేస్తానని నమ్మించాడు గాజీ.

మరుసటి రోజు ఒక జత బట్టలు తీసుకొచ్చి ఇచ్చి "స్నానం చేసి మార్చుకోమన్నాడు."

అలాగే చేసింది.

"మషా అల్లా ఎంత బావున్నావో తెలుసా" అంటూ అత్తరు పూసాడు.

ఆ వాసన తియ్యగా అనిపించింది. కాసేపటికి కళ్ళు మూతలు పడసాగాయి. మత్తు కమ్ముకుంటోంది. తరువాత శరీరమంతా పాములు పాకినట్టు అనిపించి గింజుకుంది. కానీ మత్తులో ఆమె ప్రతిఘటించాలనుకున్నా వళ్ళు సహకరించలేదు. అచేతనంగా ఉండిపోయింది.

మెలకువ వచ్చేసరికి అంతా అస్తవ్యస్తంగా వుంది. వుండాల్సిన రీతిలో లేదు. ఏం జరిగిందో అర్థం అవుతోంది.

దాదాపు గంట తర్వాత రొట్టెలు పట్టుకొచ్చాడు గాజీ.

విసిరి కొట్టింది భాగ్య. "ఏం చేసావ్ నన్ను" అని గద్దించింది.

"ఇంత అందమైన అమ్మాయి దొరికితే ఎవడైనా ఊరికే వుంటాడా. అయిందేదో అయింది. నా మాట వింటే నీకు బ్రతుకు చూపిస్తా. మహరాణిని చేస్తా" అన్నాడు నవ్వుతూ.

"ఛీ మంచివాడివని నమ్మితే ఇంత మోసం చేస్తావా..? నేనిప్పుడే వెళ్ళిపోతాను" అని పైకి లేచింది.

అడ్డుపడి రెండు చేతులూ విరిచి పట్టుకున్నాడు గాజీ.

పెనుగులాడింది. ఆమెను మూటలా మోసుకెళ్ళి సామాన్ల మధ్యలో వున్న స్థంభానికి కట్టేసాడు. అరవకుండా నోట్లో గుడ్డలు కుక్కాడు. ఆమె బ్యాగు తెరిచి పాస్ పోర్ట్ తీసుకున్నాడు.

"నా మాట వింటే నీకు మంచిది. లేకపోతే ఈ సెల్లార్ లో సామాన్ల మధ్య చస్తావ్" అంటూ వెళ్ళిపోయాడు.

అప్పటినుండీ రోజుకు రెండు రొట్టెలు ఇచ్చేవాడు. తినేటప్పుడు మాత్రమే నోట్లో గుడ్డ తీసేవాడు.

వాడికిష్టమొచ్చినప్పుడు ఆమెను కొట్టి అమానుషంగా అనుభవించేవాడు.

"ఇంటి దగ్గర ఇద్దరు పిల్లలు వున్నారని వాళ్ళు తల్లి కోసం ఎదురు చూస్తారని వదిలేయమని" కాళ్ళు పట్టుకుని ప్రాధేయ పడింది.

మస్రీ వాళ్ళు మూర్ఖులు.

ఉహూ.. వాడు ఆమె మాట వినలేదు. రోజూ అదే తంతు. ఆ గది సెల్లార్లో సామాన్లతో నింపబడి వుంది కాబట్టి అటువేపు ఎవరూ రారు. భాగ్య అరిచి గీ పెట్టినా వినేవారు లేరు. అడ్డూ అదుపూ లేకుండా వాడి ఆట కొనసాగింది.

అలా ఐదేళ్ళు గడిచాయి. ఆ సెల్లార్ లోని గదిలో సామాన్ల మధ్యలో భాగ్య నరకయాతన అనుభవించింది.

ఒకరోజు ఆమె చేతి కట్లు లూజయ్యాయి. కష్టం మీద వదిలించుకుని నోట్లో గుడ్డ తీసుకుని కాళ్ళకున్న సంకెళ్ళు ఊడతీసింది. ఏళ్ళతరువాత స్వేచ్ఛ వచ్చినట్లయింది.

పిచ్చిదానిలా గదంతా తిరిగింది. ఏడ్చింది, నవ్వింది. పాటలు పాడుకుంది.

తరువాత ఇక కర్తవ్యం ఏమిటా అని ఆలోచించి ఆ గదిలో మూలనున్న ఇనుప కమ్మీని ఒకదాన్ని చేత పట్టుకుని వాడి కోసం ఎదురు చూసింది.

ఎప్పటిలా ఆ రోజు కూడా రొట్టెల ప్లేటు పట్టుకుని తలుపు తీసాడు గాజీ.

ఇనప కమ్మీతో వాడి తలపై కొట్టింది భాగ్య. అనుకున్నంత దెబ్బ తగల్లేదు.

వెంటనే ఆమె మీద పడి కమ్మీని లాక్కుని తిరిగి ఆమె తలపై బలంగా బాదాడు.

తల పగిలింది రక్తం ధారలుగా ఆమెను తడుపుతోంది. అయినా పట్టువదలకుండా ధైర్యం చేసి వాడిని నెట్టుకుంటూ సెల్లార్ మెట్లు ఎక్కి బయటికి పరిగెత్తింది. ఆ వీధి మధ్యలో స్పృహ తప్పి పడిపోయింది.

అంతే తెలుసు ఆమెకు. రక్తపు మడుగులో వున్న ఆమెను చూసి పక్కనున్న షాపుల వాళ్ళు "యా అల్లా" ఏమయింది అనుకుంటూ అంబులెన్స్ కు ఫోన్ చేసి హాస్పిటల్ కు పంపించారు.

తెల్లారేసరికి వార్తలతో మారుమ్రోగింది కువైట్ పట్టణం.

"ఒక మస్రీ వాడు ఒక హిందీ స్త్రీని ఐదేళ్ళు సెల్లార్ లో బంధించి హింసించాడు" అనే వార్త కలవర పెట్టింది.

ఎక్కడ చూసినా అదే వార్త గింగిరాలు తిరుగుతోంది. పక్కనున్న షాపుల వాళ్ళు గాజీ షాపు కింద వున్న సెల్లార్ లో నుండి ఆ హిందీ స్త్రీ పరిగెత్తుకొచ్చిందని చెప్పారు.

పోలీసులు అక్కడికెళ్ళి తలకు దెబ్బ తగిలిన గాజీని పట్టుకుని అరెస్ట్ చేసారు.

ఆసుపత్రిలో బెడ్ పై పడుకుని వుంది భాగ్య. ఆమె తలచుట్టూ కట్టు కట్టడంతో ముఖాన్ని పోల్చుకోవడం కష్టంగా వుంది.

అస్సలు ఆమె బతకడమే ఒక అద్భుతం అంటున్నారు డాక్టర్లు. ఆ దుర్మార్గుడు గాజీ కొట్టిన దెబ్బకు తల చితికి మెదడు బయటికి వచ్చింది. డాక్టర్లు శ్రమించి ఎన్నో ఆపరేషన్లు చేసి ఆమెను బతికించారు.

ఐదేళ్ళు సరైన తిండి లేకపోవడంతో ఆమె దేహం శుష్కించిపోయింది. ఒక్కోసారి స్పృహ పోతోంది కూడా.

ఆమె మెంటల్ కండిషన్ బాలేదు. స్పృహలోకి వస్తే పిచ్చిచూపులు చూస్తోంది. డాక్టర్లు మెరుగైన వైద్యం అందిస్తున్నారు కానీ పూర్తిగా కోలుకోవడం కష్టమేనట. కొన్ని రోజులు పడుతుంది.

నర్సులు జాలిపడి ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటున్నారు.

"ఎంత ఘోరం. ఐదేళ్ళుగా వాడు ఆమెను చిత్రహింసలు పెట్టాడట. ఇంటికి కూడా పోనివ్వలేదట. పాస్ పోర్ట్ దాచేసి వేధించాడట. పిల్లలను చూడాలి ఇంటికి పోతా అని ఎన్నోసార్లు కాళ్ళు పట్టుకుందట. అయినా ఆ శాడిస్ట్ హృదయం కరగలేదు. ఆమె దేహమంతా గాయాల మచ్చలే. ఐదేళ్ళుగా ఎంత వేదన అనుభవించిందో పాపం. వాడికి ఉరిశిక్ష ఖాయం. ఇక జన్మలో భార్యా పిల్లల ముఖం చూడలేడు వాడు. ఇక్కడే జైల్లో మగ్గిపోయి చావాల్సిందే. ఆడదాన్ని వేధించడం తమాషా అనుకుంటున్నాడు వెధవ." ఆయాకు చెపుతూ తిడుతోంది తెలుగు నర్సు మాధవి.

ఆయా సక్కుబాయి "పాపం మహాతల్లి ఎంత బాధ అనుభవించిందో, తొందరగా కోలుకుంటే బావుంటుంది. తల్లికి ఏమయిందో ఎక్కడ వుందో అని ఇండియాలో పిల్లలు తల్లడిల్లిపోతుంటారు కదా" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది.

దాదాపూ రెండు నెలలు హాస్పిటల్లోనే వుంది భాగ్య. తరువాత నెమ్మదిగా కోలుకుంది. విషయం కువైట్ సిటీ అంతా ప్రాకిపోయింది. ఇండియా ఎంబసీ నుండి అధికారులు వచ్చారు. భాగ్యను ప్రశ్నలడిగి విషయం తెలుసుకున్నారు.

పట్టణం నడిబొడ్డున సెల్లార్ లో ఐదేళ్ళు వున్నా కూడా ఆమె ఆచూకీ దొరకనందుకు ఆశ్చర్యపోయారు. వాడి దుర్మార్గానికి విస్తుపోయారు.

ఆమె అనుభవించిన నరకయాతనకు సానుభూతి తెలిపి "ఏ సహాయం అవసరం అయినా మేమున్నాం, ఆ దుర్మార్గుడికి ఉరిశిక్ష పడేట్లు చూస్తాం" అనే భరోసా ఇచ్చి వెళ్ళారు.

నర్సులు ఇండియాలోని భాగ్య ఇంటికి ఫోన్ చేసి పిల్లలతో మాట్లాడించారు. ఐదేళ్ళ తరువాత అమ్మ గొంతు విన్న పిల్లలు ఆనందంతో ఏడ్చారు. త్వరలో ఇంటికి వస్తానని చెప్పింది భాగ్య.

ఆమెకు పూర్తిగా నయమయ్యాక ఇండియా ఎంబసీకి తీసుకెళ్ళారు. అక్కడ వారం రోజులున్నాక భాగ్య కోర్టులో జరిగిందంతా చెప్పాక కేసు విచారణ పూర్తయ్యింది.

ఆ కామాంధుడికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. వాడు చేసిన పనికి మంచి ముగింపు అని ఆంధ్ర నర్సులు సంతోషించారు.

"అందరూ అయ్యో ఎంత ఘోరం జరిగింది. పేదరికంతో పొట్ట పట్టుకుని పరదేశానికి పనికోసం వస్తే నీచులు ఎంత పని చేస్తున్నారు" అని జాలి చూపించి భాగ్యకు కొన్ని బహుమతులందించారు.

కొన్ని స్వచ్ఛంద సంస్థలు దినారాలు పోగు చేసి భాగ్యకు కొంత మొత్తాన్ని ఇచ్చారు. ఇండియన్ ఎంబసీ అధికారులు చెన్నై వెళ్ళే విమానంలో టికెట్ బుక్ చేసి ఇంటికి పంపించారు. భాగ్య ఇంటికి చేరుకుంది. పిల్లలను కౌగిలించుకుని కన్నీళ్ళు పెట్టుకుంది. అప్పుడప్పుడూ తలలో గాయం సలుపుతుంది.

కువైట్ లో ఐదేళ్ళు తను పడిన నరకయాతన గుర్తొచ్చి బాధ కలుగుతుంది.

కానీ ప్రాణంతో తిరిగి ఇంటికి చేరుకున్నందుకు సంతోషిస్తూ దేవుడికి దండం పెట్టుకుంటుంది.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments